# మన'వే'మన పద్యాలు

**ఆ. వె. ఛాత్రధర్మమెఱిగి చక్కని భక్తితో**
**గురుని సేవచేయగుదిరినపుడె**
**సర్వమర్మములును జక్కగా విడిపోవు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు :**

ఛాత్రధర్మము = శిష్యుడు నిర్వర్తించ వలసిన ధర్మములు.
మర్మములు = రహస్యములు, సందేహములు, సంశయములు.
విడిపోవు = నివృత్తి కలుగు.

**తాత్పర్యము** : విచక్షణాజ్ఞానముతో గురువుయందు భక్తిని కలిగి, అతనిని ఏ విధముగా సేవించవలయునో తెలిసి, గురుశిష్యుల సంబంధమును తెలిసికొని చక్కగా మెలగినపుడే నిశ్చలభక్తి అలవడుతుంది. సందేహములు అన్నియు సమసిపోవును. జ్ఞానమును సముపార్జించుటకు గురుసేవయే చక్కని మార్గము.

**ఆ. వె. అనగ ననగ రాగమతిశయిల్లుచు నుండు**
**దినగదినగ వేము తియ్యగుండు**
**సాధనమున బనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు :** అతిశయిల్లు = మించు, మెరుగుపడు, బాగుపడు.
వేము = వేప.
సమకూరు = చేకూరు, అందుబాటులోనికి వచ్చు.
ధరలోన = భూమిపైన, అవనియందు.

**తాత్పర్యము:** పాడగా పాడగా రాగము బాగుగా వచ్చును. పాడుటమానివేసినచో కంఠము సాధనము లేక మృదువుగా సాగదు. తినగా తినగా వేప చిగుళ్ళు కూడా తీయగా నుండును. అనగా చేదు నోటికి అలవాటై అదే బాగున్నట్లుండును. అదే విధముగా మొదట ఏ పనియైనను కష్టమనిపించును. చేయగా చేయగా చేయి తిరిగి నైపుణ్యము వచ్చును.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*